క్లుప్తంగా

ఉపాధి కోసం ఉద్యమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.జగదీష్ తెలిపారు. గురువారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్ డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యునాని మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర విభజన పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కడపలో యూనాని మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఆరిఫ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాష పేర్కొన్నారు. గురువారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2016లో దాదాపు 25 ఎకరాల స్థలాన్ని సేకరించిందని అందులో వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. కడప నగరం అభివృద్ధి జరిగే క్రమంలో యునాని మెడికల్ కాలేజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటుకు వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

19న పూర్వ విద్యార్థుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ ఉదయం 11 నుంచి 1 గంట వరకు పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. 1973 నుంచి ఇప్పటి వరకు కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరి వివరాలు సేకరించేందుకు, కళాశాల అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 9963410546, 9701283665 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆధ్యాత్మిక కార్యక్రమం

కడప కల్చరల్ : కడప నగరం నకాష్ వీధిలోని ఖుధీబాష దర్గా వద్ద ఇస్లాం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో మత గురువులు హజరత్ మహ్మద్ ఆలీ బగ్దాదీ, మౌలానా కుసోషి ఖతీఫ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు.

బహుమతులు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–రాజంపేట మార్గంలో అమలుపరచిన గిఫ్ట్ స్కీంలో భాగంగా లక్కీ డిప్ ద్వారా ముగ్గురు ప్రయాణికులను విన్నర్స్గా ఎన్నిక చేశామని కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం కడప ఆర్టీసీ బస్టాండులో విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి విజేతగా కోడూరుకు చెందిన కరీముల్లా, రెండవ విజేతగా కడపకు చెందిన కుమారి, మూడవ విజేతగా కడపకు చెందిన పద్మజలకు బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు కన్యాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : నగరంలోని మృత్యుంజయ కుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో గురువారం హుండీ సొమ్ము లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో శ్రీధర్, చింతకొమ్మదిన్నె గంగమ్మ దేవస్థానం ఆలయ ఈఓ పి. సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు సతీష్, శశిధర్, సిబ్బంది, భక్తులు సొమ్మును లెక్కించారు. ఆగస్టు 5 నుంచి హుండీ ద్వారా రూ.62,199 లభించిందని తెలిపారు.

బంద్కు సహకరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 8న జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్కు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వలరాజు, అంకన్న, రాజేంద్ర, వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు వారు విద్యాసంస్థల అధినేతలను కలిసి విన్నవించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మామిళ్ళ బాబు, సునీల్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప రూరల్: సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ (ఎస్జేడబ్ల్యూహెచ్ఆర్సీ) కౌన్సిల్ జిల్లా ఛైర్మన్గా బసుపల్లి విష్ణువర్ధన్రెడ్డి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంస్థ జాతీయ ఛైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్కుమార్ జిల్లా ఛైర్మన్గా విష్ణువర్ధన్రెడ్డికి నియామక పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గంప హన్మగౌడ్, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్ : కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నవంబర్ 4వ తేదీన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్రెడ్డి తెలిపారు. దివంగత కందుల శివానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కడప భారతి కంటి ఆసుపత్రి వారు కంటి వైద్య శిబిరాన్ని, బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ శివతేజారెడ్డి, డాక్టర్ హారికారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి



డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్చంద్

కడప కార్పొరేషన్ : అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్లో భాగంగా ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ నిర్మించే డ్రైనేజీ కాలువలో లెవెల్స్ సరిగా ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఓం శాంతి నగర్, వివేకానందనగర్లలో డ్రైనేజీ బ్లాకేజీలు లేకుండా చూడాలని, వర్షపునీరు డ్రైనేజీ కాలువల్లోకి వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 26వ డివిజన్ మాసాపేట సర్కిల్ వద్ద కార్మికుల హాజరుపట్టికను పరిశీలించి, వంద శాతం చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. ఈఎల్ఎస్ఆర్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న సీతారామాలయం కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్ : మాసాపేటలోని సీతారామాలయం పునర్నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆలయ ధర్మకర్త గున్నా గంగాధర్, కార్యదర్శి వరహాలు కోరారు. గురువారం ఆలయం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ మాసాపేటలోని సీతారామాలయం ఎంతో పురాతనమైనదని, దానికి తాము 1990 నుంచి ధర్మకర్తలుగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరిందని, వర్షాకాలం వస్తే ఆలయంలోకి నీళ్లు రావడమేగాక, పరిసరాలన్నీ బురదనీటితో నిండిపోతున్నాయన్నారు. ప్రస్తుతం రహదారుల విస్తరణ జరుగుతున్న దృష్ట్యా ఆలయాన్ని పునర్నిర్మించేందుకు సహకరించాలని మేయర్, కమిషనర్లను కోరామన్నారు. ఆలయానికి 54 సెంట్ల స్థలం ఉందని, అందులో చాలావరకూ ఆక్రమణకు గురైందన్నారు. రహదారుల విస్తరణలో ఆలయం కూల్చివేస్తే మిగిలిన స్థలంలో ఆలయం పునర్నిర్మించాలని తాము కోరామన్నారు. దీనివల్ల 22 మంది ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని, వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని కమిషనర్ చెప్పినా వారు వినిపించుకోవడం లేదన్నారు. ఈ దశలో కొందరు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దీన్ని రాజకీయం చేయకుండా అందరికీ న్యాయం జరిగేలా, ఆలయం పునర్నిర్మించేలా చేయాలని తాము కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మార్తమ్మ, కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉన్నట్టుండి తమ ఇళ్లను కూల్చి రోడ్డున పడేయవద్దని ఇళ్లు కోల్పోతున్న బాధితులు రాములమ్మ, అరుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కొంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఇళ్లు తొలగించాలని వారు కోరారు.

డిసెంబర్ 10న గీతా జయంతి పోటీలు

కడప కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న గీతా జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నామని ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు గోపీబాబు, బెస్తవేములు రామ మహేష్ తెలిపారు.

గురువారం నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో పలు ధార్మిక సంస్థల ప్రతినిధులు విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను తెలిపారు. ఆరు, ఏడు తరగతులు జూనియర్ విభాగంగా, 8, 9 తరగతులు సీనియర్ విభాగంగా నిర్ణయించామన్నారు. 3 వ అధ్యాయం కర్మయోగం 30 శ్లోకాలపై పోటీ నిర్వహిస్తామన్నారు. సంపూర్ణ భగవద్గీత మీద 18 ఏళ్ల లోపు జూనియర్ విభాగంగా, ఆపైబడిన వారు సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహించనున్నామన్నారు. అన్ని విభాగాలలో బహుమతులను ఇస్తామన్నారు. చైన్నై రోడ్డులోని శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చిన్మయా మిషన్ జిల్లా అధ్యక్షుడు స్వామి తురియానంద సరస్వతి, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ బట్టర్, ధార్మిక ప్రముఖులు ఏటూరి రామచంద్రారెడ్డి, ఎస్ చెన్న కృష్ణారెడ్డి, చింతకుంట శివారెడ్డి పాల్గొన్నారు.

5న విగ్రహ ప్రతిష్ట

కడప కల్చరల్ : కడప నగరంలోని ఎమ్మెస్ కొట్టాల శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో 5వ తేదీన విగ్రహ చర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీ రావు తెలిపారు. నగరానికి చెందిన వ్యాపారి అమృతవల్లి ప్రకాష్ సమర్పించిన శ్రీ కాల భైరవ స్వామి ఉత్సవ మూర్తిని ఈ సందర్భంగా చర ప్రతిష్ట చేయనున్నట్లు తెలిపారు.

వల్లూరు ఎంపీడీఓగా ప్రసాద్

వల్లూరు : వల్లూరులో ఈవోఆర్డీగా పనిచేస్తున్న కేఆర్ఎం ప్రసాద్ను ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కే జుబేద రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రమోషన్లలో భాగంగా డీఎల్డీఓగా నియమితులయ్యారు.

ప్రత్యేక ప్రార్థనలు



సమాధుల వద్ద క్రైస్తవుల ప్రార్థనలు

కడప కల్చరల్ : కడప నగరంలోని మాసాపేటలో క్రైస్తవుల సమాధుల తోట (దొరల గోరీలు)లో గురువారం ఆల్ సోల్స్ డేని పురస్కరించుకొని సమాధుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన క్రైస్తవులు పెద్దలు, పూర్వీకుల సమాధులను పరిసరాలను శుభ్రం చేసి పూలు, కొవ్వొత్తులు తదితరాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అనంతరం వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. తమ పెద్దల సమాధుల వద్ద ఆయా కుటుంబాలకు చెందిన బంధు మిత్రులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. సీఎస్ఐ చర్చికి సంబంధించి రెవరెండ్ ఫాదర్ మత్తయ్య బాబు, సీడీ భారతి, జయరాజు, స్వరూప రాణి, కమిటీ కార్యదర్శి మనోహర్, కోశాధికారి డేనియల్ బృందం కార్యక్రమంలో పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 7న జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు మండలాలు ప్రకటించాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. రామ్మోహన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ గురప్ప, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ ఆర్ .చంద్రశేఖర్ రెడ్డి, అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుబహాని ఉరుసు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబె సుబహాని, ఖుత్బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిర్స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అందుబాటులో విత్తనాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని రైతులకు సన్ఫ్లవర్ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు గురువారం ఏడీఆర్ డాక్టర్ ఎన్.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎన్డీఎస్హెచ్–102(ప్రభాత్)అనే ప్రొద్దుతిరుగుడు హైబ్రిడ్ రకం 20 క్వింటాళ్లు, ఐఎస్ఎఫ్–764 అనే కుసుమ రకం 15 క్వింటాళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రొద్దుతిరుగుడు విత్తనం కేజీ రూ.500 కాగా కుసుమ విత్తనం ధర రూ.110 ఇస్తారన్నారు. ఆసక్తి గల రైతులు పూర్తివివరాల కోసం 99896 25208, 99666 65434 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గూడ్స్ షెడ్ను కృష్ణాపురానికి తరలించ వద్దు



డీసీఎం మనోజ్కు వినతిపత్రం సమర్పిస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వే స్టేషన్ లోని గూడ్స్ షెడ్ను కృష్ణాపురానికి తరలించవద్దని హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్ష కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్. మహబూబ్బాషా కోరారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో జిల్లా పర్యటనకు వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్ డీసీఎం మనోజ్కు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల పైబడి కడప రైల్వే స్టేషన్ లో కొనసాగుతున్న గూడ్స్ షెడ్ను కృష్ణాపురం తరలించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాలయ్య, శీను, చిన్న ఓబులేసు, గంగయ్య, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లి పాల్గొన్నారు.

11న చిత్రలేఖన పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : బాల బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈనెల 11వ తేదీన కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రాజశేఖర్ రాహుల్ వెల్లడించారు. గురువారం కడప బాలోత్సవం చిత్రలేఖనం పోటీల వాల్పోస్టర్లను ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 ఉదయం 9 గంటలకు పాఠశాలల విద్యార్థులకు జరిగే చిత్రలేఖన పోటీలను సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

అగ్నిమాపక సిబ్బందికి అభినందన



అగ్నిమాపక సిబ్బందిని అభినందిస్తున్న కడప అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి

కడప అర్బన్ : ఇటీవల పెన్నానదిలో చిక్కుకున్న నలుగురు వ్యక్తులను రక్షించినందుకుగాను కడప అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న ఎం. వీరారెడ్డి, జి. హరినాథ్, ఎస్. నూర్ మహబూబ్బాషా, ఎస్ ఎండి సలార్లకు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం. భూపాల్రెడ్డి నగదు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపక అధికారి పి. బసివిరెడ్డి, సిబ్బందిని అభినందించారు.

క్రీడాదుస్తులు పంపిణీ



క్రీడాకారులతో శాప్ డైరెక్టర్, డీఎస్ఏ చీఫ్ కోచ్ తదితరులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల క్రీడామైదానంలో వివిధ క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి శాప్ డైరెక్టర్ ఎం. డానియల్ ప్రదీప్ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హాకీ, ఫుట్బాల్, కరాటే తదితర క్రీడాంశాల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ముఖ్యమంత్రి క్రీడాకానుక కింద ప్రతిభావంతులైన క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ మరింత సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్ రాజ్, థామస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతకు పూజలు

కమలాపురం : వరుణ దేవుడు కరుణించి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురవాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ చెప్పలమ్మ (హేలాంబ) అమ్మవారికి ఆయన గురువారం 101 టెంకాయలు కొట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్రెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, చిన్నిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.